




# కరపత్రం

SINCE 2014

సోమవారం జూలై 06, 2026 | సంపుటి : 2 | సంచిక : 264 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# హైదరాబాద్ మెట్రోపై

# కేంద్రమంత్రులకు సీఎం లేఖ

## నిర్ణయాల అమలులో జాప్యంపై ఆందోళన

- ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధ్యయన బాధ్యతలు ఇవ్వాలని విజ్ఞప్తి
- మెట్రో ఫేజ్-1, ఫేజ్-2లో ఆలస్యం
- డీపీఆర్‌లు, నిధుల ఆమోదం వేగవంతం చేయాలి
- జాప్యంతో ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశం
- వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి



**హైదరాబాద్:**
హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వేర్వేరుగా లేఖలు రాశారు. గత నెల 23, 24 తేదీల్లో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదని వారి దృష్టికి తీసుకెళ్లారు. మెట్రో రైలుపై అధ్యయన బాధ్యతలు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని కోరారు. దీనికి సంబంధించిన షరతులు, విధివిధానాలను వెంటనే ఖరారు చేయాలన్నారు. మెట్రో మొదటి దశ స్వాధీనం, రెండో దశకు అనుమతుల్లో జాప్యం జరుగుతోందని కేంద్రమంత్రులకు రాసిన లేఖలో సీఎం పేర్కొన్నారు. ఈ జాప్యం వల్ల మెట్రో ఫేజ్-1 నిర్వహణలో రోజువారీ ఇబ్బందులు, అనిశ్చితి ఎదురవుతున్నాయన్నారు. ఫేజ్-2 డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. దీని ఫలితంగా ప్రాజెక్టు అమలు మరింత ఆలస్యం కావడంతో పాటు వ్యయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. కేంద్రమంత్రులు వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై ఘోర ప్రమాదం.. నలుగురి మృతి



**చిట్యాల గ్రామీణం:**
నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.



## అలా చేస్తే.. భద్రాచలం మునిగిపోతుందని ఇంజినీర్లు చెప్పారు: మంత్రి ఉత్తమ్

- కాళేశ్వరం కమీషన్ల కోసమే నిర్మించారు
- మూడు బ్యారేజీల్లో నీరు నిల్వ చేయొద్దు: ఎన్‌డీఎస్‌ఏ
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనికిరావు
- రూ.1.81 లక్షల కోట్లు వృథా: ఉత్తమ్
- ప్రాజెక్టు మార్పుతో రాష్ట్రానికి నష్టం
- బీఆర్ఎస్ తప్పిదాలతో ఈ పరిస్థితి: మంత్రి

**హైదరాబాద్:**
బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను రైతుల కోసం కాకుండా కమీషన్ల కోసమే నిర్మించిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లలో ప్రాజెక్టుల పేరిట రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. కాళేశ్వరం డిజైన్ చేసింది.. కట్టింది.. కూలింది.. ఆ పార్టీ హయాంలోనేనని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్లు నాశనం చేసి ఇప్పుడు నాటకాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన తప్పిదాల వల్లే మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు పనికిరాకుండా పోయాయన్నారు. సచివాలయంలో జలవనరులశాఖ అధికారులతో కలిసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.

2లో..




## రూ. 62 కోట్ల లాటరీ గెలిచిన భారత మహిళ

ఓ భారత మహిళ అబుదాబిలో జాక్‌పాట్ కొట్టింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ. 62 కోట్ల లాటరీని గెలుచుకుంది. ఢిల్లీకి చెందిన కనికా అరోరా అనే గృహిణి కొన్న లాటరీ టికెట్‌కు రూ. 62 కోట్ల ప్రైజ్‌మనీ వరించింది. అబుదాబి బిగ్ టికెట్ సిరీస్‌లో భాగంగా ప్రతీనెల లాటరీ టికెట్ కొనే ఆ మహిళకు జూన్ 30వ తేదీన తీసిన లాటరీలో 25 మిలియన్ దిర్హమ్‌ల భారీ మొత్తం వరించింది.

2 లో



## కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో త్వరలో ఉత్పత్తి ప్రారంభిస్తాం - రైల్వే బోర్డు ఛైర్మన్

**కాజీపేట:**
హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురంలో నూతనంగా నిర్మించిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో త్వరలో ఉత్పత్తిని పారంభిస్తామని, భవిష్యత్తులో దేశానికి అవసరమయ్యే నెక్స్ట్ జెన్ కోచ్‌లను తయారు చేస్తామని రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈఓ సతీష్‌కుమార్ అన్నారు.

## పదవి లేకున్నా కాంగ్రెస్ కోసం పని చేస్తా

# కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

- రాహుల్‌గాంధీ నాయకత్వంలోనే కొనసాగుతా
- పార్టీ బలోపేతమే నా లక్ష్యం
- కార్యకర్తలకు అన్యాయం జరగొద్దు
- పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు
- రాహుల్‌తో కీలక భేటీ జరిగిందన్న రాజగోపాల్‌రెడ్డి
- వచ్చే ఎన్నికలపై పార్టీ కోసం కృషి
- రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం



2లో..

**చౌటుప్పల్:**
'నాకు పదువులిచ్చినా, ఇవ్వకున్నా రాహుల్‌గాంధీ నాయకత్వంలో పని చేస్తా, నేను కాంగ్రెస్ పార్టీకి దూరంగా లేను' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్‌లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ, ఫీనిక్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు.



## తెలంగాణకు నెక్స్ట్ సీఎం బీసీ బిడ్డనే..రాజ్యాధికార సమరభేరీలో తీర్మాన్ మల్లన్న

- 2028 ఎన్నికలే లక్ష్యంగా బీసీలు ఏకం కావాలి
- బీసీలకు అధిక రాజకీయ ప్రాతినిధ్యం డిమాండ్
- బీసీ యువతకు 42% ఉద్యోగాలు ఇవ్వాలి
- 'సర్జికల్ స్ట్రైక్-59' ఉద్యమం ప్రారంభం
- ఆధిపత్య రాజకీయాలకు ముగింపు పలుకుతాం
- రాజ్యాధికార పార్టీ బీసీల పక్షాన పోరాటం

తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ తీర్మాన్ మల్లన్న కీలక వ్యాఖ్యలు చేశారు. 2028 ఎన్నికలే లక్ష్యంగా బీసీలు రాజకీయంగా ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాల్లో బీసీలకు అధిక ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్‌తో భువనగిరిలో జరిగిన రాజ్యాధికార సమర భేరి సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీలందరూ ఏకమై ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

మిగతాద్ది 2 లో

## కేసీఆర్‌కు వారం రోజులు కాళేశ్వరం అప్పగిస్తే తెలంగాణ మొత్తానికి నీరు

- కన్నెపల్లి నుంచి లక్ష క్యూసెక్కుల నీరు వృథా
- కాంగ్రెస్ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం: కేటీఆర్
- కాళేశ్వరం అన్ని ప్రాంతాలకు నీరందించే ప్రాజెక్టు
- రైతులు ప్రభుత్వాన్ని నిలదీయాలి: కేటీఆర్
- హైదరాబాద్‌కూ తాగునీటి ఇబ్బందులు
- ప్రభుత్వం స్పందించకపోతే ముట్టడి హెచ్చరిక
- 60 వేల మందితో పంప్‌హౌస్ వద్ద ఆందోళన
- పంపులను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్
- కాళేశ్వరం నిర్వహణలో ప్రభుత్వం విఫలం: కేటీఆర్



మిగతాది 2లో

## గోదావరి పరివాహక ప్రాంత ప్రజల భద్రతలో రాజీ పడబోం: మంత్రి సీతక్క

- కాళేశ్వరం అంశంపై బీఆర్ఎస్ డ్రామాలు
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకే నిర్ణయాలు
- నిపుణుల అనుమతితోనే నీటి ఎత్తిపోతలు
- మేడిగడ్డ ప్రమాదంపై ఆందోళన
- రైతులను బీఆర్ఎస్ తప్పుదోవ పట్టిస్తోంది
- నిపుణుల కమిటీ ముందు వాదించాలి: సీతక్క



2లో

**హైదరాబాద్:**
కాళేశ్వరం అంశంపై బీఆర్ఎస్ డ్రామాలాడుతోందని మంత్రి సీతక్క విమర్శించారు. ఈ విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు, భద్రతే తమ ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమన్నారు."మేడిగడ్డ బ్యారేజ్ అంశంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదికనే ప్రభుత్వం అనుసరిస్తోంది. నిపుణులు అనుమతి ఇస్తేనే నీటిని ఎత్తిపోస్తాం. కాళేశ్వరం నిర్మాణంలో అనేక లోపాలు, అవినీతి కారణంగానే ఈ పరిస్థితి తలెత్తింది.

## బావిలో 21 గంటల నరకం.. చంపేయాలని తాడు కత్తిరించినా..

**కరీంనగర్:**
ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్‌ల వలయంలో చిక్కుకుని అప్పులపాలైన ఒక 21 ఏళ్ల విద్యార్థి, డబ్బుల కోసం ఓ మహిళను నమ్మించి తీసుకెళ్లి, దోచుకుని, ఆపై చంపేందుకు బావిలోకి నెట్టేసిన షాకింగ్ ఘటన కరీంనగర్ జిల్లాలో వెలుగుచూసింది. చావు అంచుల వరకు వెళ్లిన ఆ మహిళ సుమారు 21 గంటల పాటు బావిలోనే ప్రాణాల కోసం పోరాడి, ఎట్టకేలకు సురక్షితంగా బయటపడింది.కేసు వివరాల్లోకి వెళ్తే...కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలానికి చెందిన తంగరాల లక్ష్మి (55) అనే దినసరి కూలీ జూలై 1న పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు.



2లో..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం జూలై 06, 2026

## కేసీఆర్‌కు వారం రోజులు కాళేశ్వరం అప్పగిస్తే తెలంగాణ మొత్తానికి నీరు

మొదటిపేజీ తరువాయి
కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా కిందికి పోతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బీడు భూములకు నీరు ఇవ్వాలని కేసీఆర్ ఆలోచన చేశారన్నారు. మహారాష్ట్రకు వెళ్లి అక్కడి ప్రభుత్వాన్ని ఒప్పించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంప్‌హౌస్‌ను కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ బృందం సందర్శించింది. అంతకుముందు పలుచోట్ల కేటీఆర్ కాన్వాయ్‌ను పోలీసులు అడ్డగించడంతో వారితో బీఆర్‌ఎస్ నేతలు వాగ్వాదానికి దిగారు. పంప్‌హౌస్‌ను పరిశీలించిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

**స్పందించకపోతే 60 వేల మందితో ముట్టడిస్తాం**

"ఎన్నో అడ్డంకులు దాటుకుని కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దకు వచ్చాం. రాజకీయంగా విమర్శించడానికి ఇక్కడికి రాలేదు. కేసీఆర్ నాలుగేళ్లలో 141 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేశారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలు మినహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు ద్వారా నీరు ఇవ్వొచ్చు. వర్షం పడకపోయినా కన్నెపల్లి వద్ద నీరు ఉంటుంది. కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్టును వారం రోజులు అప్పగిస్తే తెలంగాణ మొత్తానికి నీరు అందిస్తారు.
కన్నెపల్లికి రైతులు వచ్చి చూసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలి. కేసీఆర్ సీఎంగా ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదా? సాగునీటి కోసమే కాదు.. హైదరాబాద్‌లో తాగునీటికి కూడా ఇబ్బంది ఉంది. అందరం కలిసికట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుదాం. ప్రభుత్వం స్పందించకపోతే 60వేల మందితో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి పంప్‌లను ఆన్ చేస్తాం. రైతులకు మించిన ప్రాధాన్యత ప్రభుత్వానికి ఉండకూడదు" అని కేటీఆర్ అన్నారు.

## బావిలో 21 గంటల నరకం.. చంపేయాలని తాడు కత్తిరించినా..

మొదటిపేజీ తరువాయి
దీంతో ఆమె కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, మొదట సాధారణ మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. అయితే, మరుసటి రోజు ఉదయం నుస్తులాపూర్ గ్రామ శివార్లలోని ఒక వ్యవసాయ బావిలో మహిళ పడి ఉన్నట్లు స్థానిక రైతులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చి ఆమెను రక్షించారు.
పోలీసుల విచారణలో బాధితురాలు లక్ష్మి అసలు నిజాన్ని బయటపెట్టింది. ఒక అపరిచిత వ్యక్తి తన పొలంలో పని ఇప్పిస్తానని చెప్పి నమ్మించాడని ఆమె తెలిపింది. మొదట ర్యాపిడో బైక్ బుక్ చేసి ఆమెను తిమ్మాపూర్ వైపు తీసుకెళ్లాడు. అయితే అక్కడ సీసీటీవీ కెమెరాలు, జనం ఎక్కువగా ఉండటంతో, నిర్మానుష్య ప్రాంతం కోసం ఆమెను తన సొంత బైక్‌పై నుస్తులాపూర్ శివార్లలోని ఒక నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ లక్ష్మిని బెదిరించి ఆమె వద్ద ఉన్న 5 గ్రాముల బంగారు ఆభరణాలు, 20 గ్రాముల వెండి పట్టీలు, నగదును దోచుకున్నాడు.
తాను దొరికిపోకూడదనే ఉద్దేశంతో, నిందితుడు లక్ష్మిని అక్కడే ఉన్న ఒక లోతైన వ్యవసాయ బావిలోకి నెట్టేశాడు. బావిలో పడ్డాక ఆమె లోపల ఉన్న ఒక తాటిని పట్టుకుని పైకి రావడానికి ప్రయత్నించింది. అది గమనించిన నిందితుడు, ఆమె ఎలాగైనా చంపాలనే క్రూరమైన ఆలోచనతో ఆ తాడును కూడా కత్తిరించాడు.
అయితే లక్ష్మికి ఈత రావడం ఆమె ప్రాణాలను కాపాడింది. తాడు తెగినా ధైర్యం కోల్పోకుండా, మోటార్ పైప్‌లైన్‌కు ఉన్న కేబుల్ వైరును పట్టుకుని రాత్రంతా బావిలోనే గడిపింది. మరుసటి రోజు ఉదయం రైతులు ఆమె అరుపులు విని బయటకు తీసేవరకు, దాదాపు 21 గంటల పాటు ఆమె మృత్యువుతో పోరాడింది.
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘోరానికి ఒడిగట్టిన నిందితుడిని ధమ్మ దినేష్ రెడ్డి (21) అనే విద్యార్థిగా గుర్తించారు. ర్యాపిడో బుకింగ్ రికార్డులు, సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ డేటా ఆధారంగా ప్రత్యేక బృందం నిందితుడిని పట్టుకుంది. విచారణలో అతను ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ యాప్‌లలో దాదాపు రూ. 4 లక్షలు నష్టపోయి అప్పులపాలయ్యాడని, ఆ అప్పులు తీర్చడానికే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ఒప్పుకున్నాడు.
అలాగే, దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన ఒక జ్యువెలరీ వ్యాపారిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

## కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో త్వరలో ఉత్పత్తి ప్రారంభిస్తాం - రైల్వే బోర్డు చైర్మన్

మొదటిపేజీ తరువాయి
ఆయన ఆదివారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీవాస్తవతో కలిసి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్)ని పరిశీలించారు. ఆర్వీఎన్‌ఎల్ అధికారులు ఆయనకు ముందుగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫ్యాక్టరీ నిర్మాణం గురించి వివరించారు. మెయిన్ షెడ్, బోగీషాపు, పెయింట్ షాపు, వీల్‌షాపు, టెస్టింగ్ షాపులను తనిఖీ చేశారు.
సతీష్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. ఫ్యాక్టరీకి అవసరమైన యంత్రాలను సిద్ధం చేశామని, వాటి పనితీరును పరిశీలిస్తున్నామన్నారు. విభిన్న రకాల కోచ్‌ల తయారీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్‌ఎంయూలో స్థానికులకు ఉద్యోగాల కల్పనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. అధికారులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలను, అమృత్‌భారత్ పనులను పరిశీలించారు. అనంతరం ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్, టెలికమ్యూనికేషన్స్‌ను సందర్శించారు. అక్కడ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన యాంటీ కొలిజన్ సిస్టమ్ 'కవచ్ 4.0' అమలు తీరును తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్వీఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ ఆనంద్ చకీల, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీరు మల్లికార్జునరావు, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణ ఉన్నారు.

## తెలంగాణకు నెక్ట్స్ సీఎం బీసీ బిడ్డనే..రాజ్యాధికార సమరభేరీలో తీన్మార్ మల్లన్న

మొదటిపేజీ తరువాయి
తెలంగాణసమాచారం డాక్టర్ బిక్షపతి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి బీసీ ఉద్యమంలో చేరడం అభినందనీయమని అన్నారు. రాయగిరి రైతులకు తమ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బీసీ యువతకు 42 శాతం ఉద్యోగాలు రావాలని డిమాండ్ చేశారు.
పీవీ నరసింహారావు తీసుకొచ్చిన ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని ప్రస్తావిస్తూ, దొరల భూములను పేదలకు అందించడమే రాజ్యాధికార పార్టీ లక్ష్యమని చెప్పారు. భువనగిరి నియోజకవర్గంలో 19 వేల మంది రెడ్లు ఉండగా, లక్షా 60 వేల మంది బీసీలు ఉన్నారని అయినా రాజకీయంగా వెనకబడి ఉన్నారన్నారు.
భువనగిరి, మునుగోడు, పెద్దపల్లి, నల్లగొండ ప్రాంతాల్లో గత 58 ఏళ్లుగా రెడ్లే ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నారని, 2028 ఎన్నికల్లో బీసీలు ఎమ్మెల్యేలుగా గెలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ప్రస్తుతం 59 మంది ఆధిపత్య కులాలకు చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు.
సర్జికల్ స్ట్రైక్-59పేరుతో ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని, అసెంబ్లీని బీసీ ప్రజాప్రతినిధులతో నింపడమే తమ లక్ష్యమని అన్నారు. మరో 884 రోజుల్లో బీసీ బిడ్డ ముఖ్యమంత్రి అవుతారని, ఆధిపత్య రాజకీయాలకు ముగింపు పలకడమే తమ లక్ష్యమని తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు.

## పదవి లేకున్నా కాంగ్రెస్ కోసం పని చేస్తా
## కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, కార్యకర్తలను కాపాడుకునేందుకు కృషి చేస్తున్నాను. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలంటే ఏం చేయాలి.. ఇచ్చిన హామీలను ఎంత వరకు నెరవేర్చాం.. ప్రజల మనసులను గెల్చుకునేందుకు ఇంకేం చేయాలి.. ప్రభుత్వం నుంచి వాళ్లేం ఆశిస్తున్నారు అని నిత్యం ఆలోచిస్తున్నాను. మొదట్నుంచీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలు చాలా మంది ఉన్నారు. వాళ్లకు అన్యాయం జరుగకూడదనే తప్పనిసరి పరిస్థితుల్లో యాదగిరిగుట్ట దేవస్థాన కమిటీ గురించి మాట్లాడాల్సి వచ్చింది. అది పార్టీకి వ్యతిరేకం చేయాలనో, ముఖ్యమంత్రికి వ్యతిరేకమో, ప్రభుత్వానికి చెడ్డ పేరు రావాలనో అలా మాట్లాడలేదు. నేను ఇటీవల రాహుల్‌గాంధీని కలిశాను. ఆయన నాకిచ్చినంత సమయం తెలంగాణ రాష్ట్రంలో ఇంకెవ్వరికీ ఇచ్చి ఉండరు. పార్టీ, ప్రభుత్వ పనితీరుపై, నా కుటుంబ నేపథ్యం గురించి అడిగారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం ఎలా.. ఏం చేస్తే బాగుంటుందని అడిగారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలనే లక్ష్యంతో నేను పని చేస్తా" అని అన్నారు.

## రూ. 62 కోట్ల లాటరీ గెలిచిన భారత మహిళ

మొదటిపేజీ తరువాయి
తన చిరకాల స్వప్నాన్ని నిజం చేసుకోవడంతో సదరు మహిళ ఉబ్బితబ్బిబ్బై పోతోంది. సంవత్సరాలుగా ఢిల్లీకి చెందిన ఆమె కుటుంబానికి బిగ్ టికెట్ ఎంట్రీ కొనడం నెలవారీ అలవాటుగా మారింది. గృహిణి అయిన కనికా అరోరా అబుదాబి బిగ్ టికెట్ సిరీస్ 288 డ్రాలో 25 మిలియన్ దిర్హమ్‌ల గ్రాండ్ ప్రైజ్ (సుమారు రూ. 62 కోట్లు) గెలుచుకుని, చిరకాల స్వప్నాన్ని నిజం చేసుకున్నారు.
దీనిపై ఆమె ఆనందం వ్యక్తం చేస్తూ.. ' కొన్నేళ్లుగా లాటరీ టికెట్లు కొంటూనే ఉన్నాం. సోషల్ మీడియా ద్వారా ఆ టికెట్‌ను కొనుగోలు చేశాం. అబుదాబిలో లాటరీ టికెట్ల కొనుగోలులో ఒక రకమైన ప్రమాదం ఉన్నప్పటికీ, వాటిని మాత్రం ప్రతీనెలా కొంటూనే ఉన్నాం. ఇన్నాళ్లకు మా కల సాకారమైంది. లాటరీలో బహుమతి గెలిస్తే ఆ మొత్తా?న్ని ఏం చేయాలో అనే దానిపై నా భర్త, నేను మాట్లాడుకుంటూ ఉండేవాళ్లం. ఇప్పుడు నిజంగా గెలవడంతో ఎక్కడ నుంచి ప్రారంభించాలో కూడా తెలియడం లేదు. ప్రతీ ఒక్కరూ అదృష్టాన్ని పరీక్షించుకోవాలి. మన కల ఎలా నిజమౌతుందో చెప్పలేం కదా' అంటూ ఆనందం ?వ్యక్తం చేసిదామె.

## అలా చేస్తే.. భద్రాచలం మునిగిపోతుందని ఇంజనీర్లు చెప్పారు: మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి
"మూడు బ్యారేజీల్లో నీరు నిల్వ చేయొద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చెప్పింది. ఫౌండేషన్‌లో లోపాలు ఉన్నాయని నిపుణులు తెలిపారు. నీరు నిల్వ చేస్తే మేడిగడ్డ కొట్టుకుపోతుందని.. భద్రాచలంతో పాటు పలు గ్రామాలు మునిగిపోతాయని ఇంజినీర్లు చెప్పారు. బీఆర్‌ఎస్ నేతల కక్కుర్తితో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. కమీషన్ల కోసమే ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చారు. ఎక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ కమీషన్లు వస్తాయని భావించారు. ప్రాజెక్టు సరిగా నిర్మించి ఉంటే వినియోగించేందుకు మాకు అభ్యంతరం లేదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దింపే పరిస్థితి లేదు. గేట్లు దింపి నీరు నిల్వ చేయకుండా ఎత్తిపోయలేం. ప్రాణహిత- చేవెళ్లపై రూ.11వేల కోట్లు ఖర్చు చేశాక ప్రాజెక్టును మార్చారు. రీడిజైనింగ్ చేసిన కొత్త ప్రాజెక్టు పూర్తికి రూ.1.20లక్షల కోట్లు అవసరమని కాగ్ ఆనాడే చెప్పింది" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

## గోదావరి పరివాహక ప్రాంత ప్రజల భద్రతలో రాజీ పడబోం: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి
మేడిగడ్డలో ప్రమాదం జరిగితే గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. రైతుల పేరుతో ప్రజలను బీఆర్‌ఎస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోంది. గోదావరి పరివాహక ప్రాంత ప్రజల భద్రతలో ప్రభుత్వం ఎలాంటి రాజీపడబోదు. బీఆర్‌ఎస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే నిపుణుల కమిటీ ముందు వాదనలు వినిపించాలి" అని సీతక్క అన్నారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై ఘోర ప్రమాదం.. నలుగురి మృతి

మొదటిపేజీ తరువాయి
ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. చెన్నై నుంచి హైదరాబాద్‌కు కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా.. పెద్దకాపర్తి శివారుకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఒడిశాకి చెందిన అర్షియా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కారును బలంగా ఢీకొట్టింది.

ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా నుజ్జునుజ్జవడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవింగ్ చేస్తున్న వీవీ ప్రసాద్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న చిట్యాల పోలీసులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని క్రేన్ సాయంతో ధ్వంసమైన కారును తొలగించి, అందులో ఇరుక్కుపోయిన మృతదేహాలను అతి కష్టంమీద బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ప్రసాద్ భార్య, కుమారుడు, కుమార్తెతో పాటు ఆయన స్నేహితుడు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. మృతుల వద్ద లభించిన ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు పత్రాల ఆధారంగా వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడకు చెందిన వారు కాగా ప్రస్తుతం హైదరాబాద్ లోని నివాసం ఉంటున్నారని తెలిసింది. ఈ ఘటనపై చిట్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా.. పోలీసులు, ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది రాకపోకలను పునరుద్ధరించారు.

## ఆదర్శ రాజకీయ నేత రోశయ్య జయంతి సభలో మంత్రి వివేక్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నేటి తరానికి ఆదర్శప్రాయుడైన రాజకీయ నాయకుడని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన రోశయ్య 93వ జయంతి సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వివేక్.. రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోశయ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రోశయ్య ప్రతిపక్ష నేతగా అత్యంత కీలక పాత్ర పోషించారు.

## అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం ట్రంప్‌కు, అమెరికా ప్రజలకు మోడీ శుభాకాంక్షలు

అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడితో పాటు ఆ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే 250 సంవత్సరాలు అమెరికాకు మరింత గొప్ప శ్రేయస్సు, శాంతి, పురోగతిని తీసుకురావాలని మోదీ ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ శనివారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'అమెరికా చరిత్రాత్మక 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు, అమెరికా ప్రజలకు.. 140 కోట్ల మంది భారతీయుల తరఫున నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. భారత్, అమెరికాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మించిన బంధం ఉంది. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలనపై ఉన్న ఉమ్మడి నమ్మకం, ప్రజల అపరిమితమైన సామర్థ్యాలు.. రెండు దేశాల మధ్య స్నేహాన్ని ప్రపంచ శ్రేయస్సుకు ఒక శక్తిగా మారుస్తున్నాయి. రాబోయే 250 సంవత్సరాలు అమెరికాకు మరింత గొప్ప శ్రేయస్సు, శాంతి, పురోగతిని తీసుకురావాలని.. అలాగే భారత్-అమెరికా భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను' అని రాసుకొచ్చారు.

## ఆస్ట్రేలియా పర్యటనకు ముందే బెదరింపులు ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా ప్రధాని మోడీకి హెచ్చరికలు

భారత ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా బెదిరింపులు వచ్చాయి. మెల్‌బోర్న్ మీట్స్ మోదీ పేరిట జరగనున్న ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల ప్రమోషన్ కోసం ఉద్దేశించిన ఒక ఫేస్ బుక్ పోస్టుకు కామెంట్ రూపంలో నిందితులు ఈ బెదిరింపులకు దిగారు. అబూ ముస్తాఫా పేరిట ఉన్న అకౌంట్ నుంచి నిందితులు ఈ పోస్టు పెట్టారు. 'స్టేడియం రూఫ్‌టాప్‌ను మూసేస్తే మంచిది. ఈ కార్యక్రమానికి మోదీ రావడమంటే మృత్యువు కోసం వస్తున్నట్టే' అని కామెంట్ చేశారు. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారు. ఏ ఐపీ అడ్రస్ నుంచి ఈ పోస్టు వచ్చిందో గుర్తించారు. అయితే, ఈ ఉదంతంలో ఎవరినైనా అరెస్టు చేశారా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనను తీవ్రంగా పరగణిస్తున్నామని ఆస్ట్రేలియా అధికారులు తెలిపారు. పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాయి. ఇక ప్రధాని మోదీ జులై 8-10 మధ్య ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. జులై 9న మెల్‌బోర్న్ మీట్స్ మోదీ ఈవెంట్‌లో పాల్గొంటారు. ఈ పర్యటన సందర్భంగా ఆస్ట్రేలియా-ఇండియా వార్షిక సమావేశంలో కూడా మోదీ పాల్గొంటారు. ఈ సమావేశాల గురించి ఆస్ట్రేలియా ప్రధాని ఆంథొనీ ఆల్బనీస్ ప్రకటించారు. భారత్ ఆస్ట్రేలియాకు గొప్ప వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామి అని అన్నారు.

## రోడ్డు ప్రమాదం వెనక హత్యా పథకం కోదాడలో నిందితుడిని పట్టించిన సిసి ఫుటేజ్

జిల్లాలోని కోదాడ పట్టణంలో సాధారణ రోడ్డు ప్రమాదంగా భావించిన ఒక ఘటన వెనుక ఉన్న నమ్మలేని దారుణ నిజం సీసీ ఫుటేజీలో బయటపడింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో షాకింగ్ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. గొడవ పడుతున్న ఇద్దరిని విడిపించిన పాపానికి చివరికి తన ప్రాణాలే పోగొట్టుకోవడం చూసి కన్నీటిపర్యంతమవుతున్నారు. పోలీసుల కథనం మేరకు.. గత నెల 30న కోదాడలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో యాకూబ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మొదట అంతా దీనిని లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల జరిగిన ప్రమాదంగానే భావించారు. అయితే ఈ ఘటనపై పోలీసులు లోతుగా విచారణ జరిపి, ఘటనా స్థలంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించడంతో అసలు నిజాలు బయటపడ్డాయి. ఇది ప్రమాదం కాదు, పక్కా ప్లాన్‌తో జరిగిన హత్య అని తేలింది. స్థానిక బార్‌లో మహేష్, రమేష్ అనే ఇద్దరు యువకులు మద్యం సేవిస్తూ గొడవ పడ్డారు. అక్కడే ఉన్న యాకూబ్ అనే వ్యక్తి మానవత్వంతో వారిద్దరినీ వారించడానికి ప్రయత్నించాడు. గొడవ సద్దుమణిగిన తర్వాత యాకూబ్ బార్ నుంచి బయటకు వచ్చి మేళ్లచెరువు రోడ్డు సిగ్నల్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్నాడు. అయితే తన గొడవలో జోక్యం చేసుకున్నాడనే కోపంతో మహేష్ అనే యువకుడు యాకూబ్‌ను వెంబడించాడు. యాకూబ్ రోడ్డుపై వెళు తుండగా, వెనుక నుంచి వచ్చిన మహేష్ అతడిని కాలితో బలంగా తన్నాడు. దాంతో యాకూబ్ రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో పక్క నుంచి వెళ్తున్న లారీ చక్రాలు యాకూబ్ శరీరంపై నుంచి వెళ్లడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు.
వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ యాకూబ్ ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే నిందితుడు మహేష్ తెలివిగా ఈ నేరాన్ని లారీ డ్రైవర్‌పైకి నెట్టేందుకు ప్రయత్నించాడు. పోలీసులు కూడా ప్రాథమికంగా లారీ డ్రైవర్‌పైనే కేసు నమోదు చేసే దిశగా ఆలోచించారు. కానీ, సంఘటనా స్థలంలో ఉన్న సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించడంతో మహేష్ చేసిన ఘాతుకం స్పష్టంగా రికార్డయ్యింది. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు అసలు నిజాన్ని వెలుగులోకి తెచ్చి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## ఎపిలో 51 పట్టణాల్లో స్ట్రీట్ వెండింగ్ ప్లాన్ ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని 51 పట్టణ స్థానిక సంస్థల స్ట్రీట్ వెండింగ్ ప్లాన్‌లకు ఆమోదం తెలిపింది. స్ట్రీట్ వెండర్ల చట్టం-2014 ప్రకారం జీవో ఎంఎస్ నెం.140ను జారీ చేస్తూ, వీధి వ్యాపారులకు వర్తించే నిబంధనలు, అమలు మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం.. వెండింగ్ జోన్లలో శాశ్వత నిర్మాణాలకు అనుమతి ఉండదు. తాత్కాలిక స్టాళ్లు ఏర్పాటు చేసుకుని మాత్రమే వ్యాపారం నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే రహదారులు, ఫుట్‌పాత్‌లు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని స్పష్టం చేసింది. రోడ్ల విస్తరణ, ప్రజాప్రయోజనాల కోసం అవసరమైతే వీధి వ్యాపారులు తమ వ్యాపార స్థలాన్ని మార్చాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. విద్యుత్ వ్యవస్థలు, డ్రైనేజీలు, ప్రతిపాదిత రహదారుల సమీపంలో ఎలాంటి ఆక్రమణలు చేయరాదని ఆదేశించింది. వెండింగ్ జోన్లలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, చెత్తను నిర్దేశిరచిన ప్రాంతాల్లో మాత్రమే వేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. ప్రజారోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. ప్రతి ఐదేళ్లకోసారి పట్టణ స్థానిక సంస్థలు స్ట్రీట్ వెండింగ్ ఎ÷-లాన్‌ను రూపొందించి అవసరమైన మార్పులు చేయనున్నాయి. అర్హులైన వీధి వ్యాపారులకు మాత్రమే వెండింగ్ సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. అలాగే వెండింగ్ జోన్లలో మౌలిక సదుపాయాలను యూఎల్‌బీలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

## రాధాగాయత్రి మృతి కేసులో సహకరించండి సైనిక వెల్ఫేర్ డైరెక్టర్‌ను కలిసిన తల్లిదండ్రులు

ఉత్తరాఖండ్‌లోని మసూరీలో ఇటీవల అనుమానాస్పద రీతిలో మృతి చెందిన టెకీ రాధా గాయత్రి కేసులో జోక్యం చేసుకోవాలంటూ... సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ వీరేంద్ర ప్రసాద్ భట్‌ను రాధాగాయత్రి తల్లిదండ్రులు సుధాకర్, సత్యవతి కోరారు. బాధిత కుటుంబం శనివారం ఉత్తరాఖండ్‌లోని సైనిక్ వెల్ఫేర్ డైరెక్టరేట్‌ను ఆశ్రయించింది. దేహ్రాదూన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్పరమేంద్ర సింగ్ డోబాల్, డిప్యూటీ ఎస్పీ జేసీ పంత్‌లతో చర్చించి ఈ కేసులో న్యాయబద్ధమైన సమగ్ర దర్యాప్తు జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ వీరేంద్ర ప్రసాద్ భట్‌ను అభ్యర్థించారు. అలాగే పోస్టుమార్టం నివేదికపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించాలని కోరుతూ దేహ్రాదూన్ కలెక్టర్ ఆశిష్ చౌహాన్‌ను సంప్రదించాలని డైరెక్టర్‌ను కోరారు.ద
బాధిత కుటుంబానికి మద్దతిస్తానని లెఫ్టినెంట్ కల్నల్ పేర్కొన్నారు. టెకీ గాయత్రి

# తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ కాలేజ్ ను తనిఖీ చేసిన కలెక్టర్

▪ వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద

కరపత్రం ప్రతినిది వరంగల్,జూలై 5



వరంగల్ జిల్లా నర్సంపేటలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ ꠸ జూనియర్ కాలేజీని జిల్లా కలెక్టర్ డా.సత్య శారద ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యా ప్రమాణాలు,మౌలిక వసతులు,హాస్టల్ నిర్వహణ,పరిశుభ్రత,విద్యార్థినులకు అందుతున్న భోజన నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా హాస్టల్ వంటగది,వంట సామాగ్రి నిల్వలను పరిశుభ్రంగా నిర్వహించాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.విద్యార్థినుల భాషా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు వారంలో మూడు రోజులు తెలుగు,హిందీ,ఇంగ్లీష్ భాషలను తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్య,ఆహారం,పరిశుభ్రత,క్రమశిక్షణ తదితర ఐదు ప్రధాన అంశాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని,ప్రతి కమిటీలో ఇద్దరు విద్యార్థినులను సభ్యులుగా చేర్చి బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు.ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించిన ఆమె,భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ,విలువలను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు సూచించారు.ఈ తనిఖీలో డీబీసీడీఓ పుష్పలతతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్ పర్యటనకు ముందు వరంగల్‌లో బీఆర్ఎస్ నేతల అదుపు

కరపత్రం ప్రతినిది వరంగల్, జూలై 5




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటన నేపథ్యంలో వరంగల్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. పర్యటనకు ముందు వరంగల్ ఈస్ట్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఇక్బాల్, మహ్మద్ అహ్మద్‌తో పాటు పలువురు పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కేటీఆర్ పర్యటనకు తరలివెళ్లకుండా అడ్డుకునేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. మరోవైపు, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఘటనపై పోలీసు శాఖ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అదుపులోకి తీసుకున్న వారి సంఖ్య, కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# కాలుష్యరహిత పర్యావరణాన్ని భావి తరాలకు అందించాలి

కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూలై 5



భావితరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని నారాయణ ఈ టెక్నో విద్యా సంస్థల జనరల్ మేనేజర్ కె.గోపాల్ రెడ్డి అన్నారు. నారాయణగూడ నారాయణ ఈ టెక్నో హైస్కూల్లో ప్రిన్సిపాల్ విశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఘనంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసర ప్రాంతాల్లో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వాయు, శబ్ద కాలుష్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాల్లో మొక్కలు నాటారు. ప్రకృతిని కాపాడాలిసన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యం, వాతావరణం అందించే మొక్కలు పెంపకం అత్యంత అవసరమని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం ఎంతో అవసరమని విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. మొక్కల పెంపకం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పరమేశ్వర్, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సేవకు ముగింపు.. సత్కారానికి శ్రీకారం

## -- పదవీ విరమణ వేడుకలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

▪ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ చిప్యాల వనకర్ రెడ్డిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

కరపత్రం ప్రతినిధిబ్యూరో, జూలై 5



ప్రభుత్వ సేవలో విశిష్ట సేవలందించిన డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్, తొర్రూరు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ చిప్యాల వనకర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన చిప్యాల వనకర్ రెడ్డిని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సేవలో ఆయన అంకితభావంతో పనిచేసి ప్రజలకు అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు.

అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు కాదని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని అన్నారు. ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని చిప్యాల వనకర్ రెడ్డి దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్, మండల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందిన అధికారిని అభినందించారు.

# 30 ఏళ్ల బోధనా సేవకు ఘన సన్మానం

▪ మీలాంటి ఉపాధ్యాయురాళ్లే దేశానికి మూలధనం
▪ ఎమ్మెల్యే నాయిని,ఎంపీ కడియం కావ్య





కరపత్రం ప్రతినిది హనుమకొండ,జూలై 5

జనగామ జిల్లాలోని చల్పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్ఏ(ఇంగ్లీష్)ఉపాధ్యాయురాలిగా మూడు దశాబ్దాల పాటు విశిష్ట సేవలందించిన జుబైదా హుస్సేన్ పదవీ విరమణ సందర్భంగా ఆదివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ రాజ్ ముహమ్మద్ అధ్యక్షత వహించగా,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వారు జుబైదా హుస్సేన్‌ను శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ,"మీలాంటి అంకితభావం కలిగిన ఉపాధ్యాయురాళ్లే దేశానికి నిజమైన మూలధనం.జుబైదా హుస్సేన్ వంటి ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు అని కొనియాడారు.తెలంగాణ లైబ్రరీ చైర్మన్ డాక్టర్ ఎం.డి.రియాజ్,టీఎస్ మేసా జాతీయ అధ్యక్షుడు ఎం.ఏ.ఫరూఖ్ అహ్మద్ తదితరులు మాట్లాడుతూ,జుబైదా హుస్సేన్ తన సౌమ్యత,క్రమశిక్షణ,అంకితభావంతో వందలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేశారని,ఆమె కేవలం ఉపాధ్యాయురాలు మాత్రమే కాకుండా ఆదర్శ నాయకురాలని ప్రశంసించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు,లెక్చరర్లు,ప్రిన్సిపాళ్లు,విద్యార్థులు,ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జుబైదా హుస్సేన్ కుటుంబ సభ్యుల్లో అల్లుడు,కోడలు,కుమారుడు సహా డాక్టర్ హనీఫ్,డాక్టర్ హుమైరా,డాక్టర్ సబిహా నిగర్,డాక్టర్ జాన్ బషా వైద్య వృత్తిలో సేవలందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమాన్ని డాక్టర్ రాజ్ ముహమ్మద్,రంజాన్ అలీ సమన్వయం చేయగా,అనంతరం పాల్గొన్న వారికి భోజన విందు ఏర్పాటు చేశారు.

# ఏళ్ల తరబడి ప్రజలను వేధించిన 33 కేవీ విద్యుత్ లైన్ సమస్యకు చెక్..

▪ కౌన్సిలర్ పొన్నం స్వరూప - రాజయ్య చొరవతో పరిష్కారం
▪ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో స్థానికుల సమస్యకు శాశ్వత పరిష్కారం.. కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు

కరపత్రం ప్రతినిధిబ్యూరో, జూలై 5



ఎన్నో సంవత్సరాలుగా స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న 33 కేవీ విద్యుత్ లైన్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారం, 17వ వార్డు కౌన్సిలర్ పొన్నం స్వరూప - రాజయ్య చొరవతో ప్రమాదకరంగా ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించి ప్రజలకు ఊరట కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని 33 కేవీ విద్యుత్ లైన్ కారణంగా స్థానికులు చాలా కాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే గాదె ఈశ్వరయ్య ఇంటి వద్ద విద్యుత్ తీగలు అత్యంత తక్కువ ఎత్తులో ఉండటంతో భారీ వాహనాలు, పాఠశాల బస్సులు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదకర పరిస్థితులు నెలకొనేవి. ఈ సమస్యపై గతంలో పలుమార్లు అధికారుల, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో సమస్యను 17వ వార్డు కౌన్సిలర్ పొన్నం స్వరూప - రాజయ్య దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో సంబంధిత అధికారులతో సమన్వయం చేసి 33 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించేలా చర్యలు చేపట్టారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ప్రజలను వేధిస్తున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కౌన్సిలర్ పొన్నం స్వరూప - రాజయ్యలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ గోనెల ఉపేందర్, పొన్నం నాగరాజు, రంజిత్ కుమార్, నీల పరశురాములు, మామిండ్ల శ్రీను, పండుగ అశోక్, మునిగేల రాజు, రమేష్, మధు, పవన్, శ్రవణ్, వేముల రాము, పిట్టల చంద్రయ్య, ఉరడి శ్రీను, అఖిల్, కుంభం మధు, నితిన్, శగా శివ, చెవినబోయిన అనిల్, శగా రాజు, శంకర్, మహేష్, పిట్టల హరీష్, పొన్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మహిళా కాంగ్రెస్‌కు ఆల్కా లాంబా దిశానిర్దేశం

» గాంధీ భవన్‌లో ఘన స్వాగతం.. సంస్థాగత బలోపేతం, మహిళా సాధికారతపై కీలక చర్చలు

కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూలై 5



తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం ఆదివారం గాంధీ భవన్‌లో ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కా లాంబాకు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించిన అనంతరం మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఘనంగా స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో తెలంగాణలో మహిళా కాంగ్రెస్ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచడం, పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, మహిళల సమస్యలపై ఉద్యమాలను మరింత ఉధృతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

అనంతరం ఆల్కా లాంబా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల హక్కుల పరిరక్షణ, మహిళా సాధికారత, సామాజిక-ఆర్థిక అభివృద్ధిలో మహిళల పాత్ర, తెలంగాణలో మహిళా కాంగ్రెస్ చేపట్టనున్న భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై పార్టీ నిర్వహించనున్న పోరాటాల గురించి మీడియాకు వివరించారు. మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తూ ప్రతి జిల్లాలో పార్టీ కార్యకలాపాలను ప్రజలకు చేరువ చేయాలని, మహిళల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాలువాలు కాదు.. పుస్తకాలే నిజమైన సన్మానం

» సయ్యద్ ఇంతియాజ్ వినూత్న పిలుపు

కరపత్రం ప్రతినిధి వరంగల్, జూలై 5



సన్మానాల పేరుతో శాలువాలు, పూల బొకేలు అందుకోవడం కంటే, అదే డబ్బుతో పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించడం గొప్ప సేవ అని 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ పిలుపునిచ్చారు. ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తూ, గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి ఎన్నికైన సయ్యద్ ఇంతియాజ్‌కు బాలాజీ నగర్ బైబిల్ పెంతెకోస్తల్ చర్చ్ ఆఫ్ గాడ్ (బీపీసీ) సభ్యులు ఆదివారం ఘన సన్మానం నిర్వహించారు. చర్చి పాస్టర్ సిలువేరు షద్రక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సయ్యద్ ఇంతియాజ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ, డివిజన్ అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మరోసారి పార్టీ బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని పాస్టర్ షద్రక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సయ్యద్ ఇంతియాజ్ తన సన్మానానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు వినూత్నమైన సందేశం ఇచ్చారు. తనకు శాలువాలు, పూల బొకేలు తీసుకురావడానికి ఖర్చు చేసే డబ్బుతో పేద విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్, పుస్తకాలు కొనిపెట్టాలని కోరారు. సమాజానికి ఉపయోగపడే ఈ చిన్న సహాయం ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగునిస్తుందని ఆయన అన్నారు. అలాగే 14వ డివిజన్‌లోని ప్రతి ప్రజా సమస్యను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లి, వేగంగా పరిష్కారమయ్యేలా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాలాజీ నగర్ బీపీసీ చర్చి అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఎమ్మెల్యేతో ప్రత్యేకంగా చర్చించి సహకారం అందించే బాధ్యతను కూడా తీసుకుంటానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ నగర్ శాఖ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్, 14వ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పస్తం శంకర్, పస్తం వీరస్వామి (కల్ నాయక్), సిలువేరు సుదర్శన్, మామూనూరి రవి, చింత అనిల్, సిలువేరు స్వామి, సిలువేరు ప్రసాద్, సిలువేరు శ్రీనివాస్, ఎల్లయ్య, భరత్, ప్రశాంత్, సుధీర్ తదితరులు పాల్గొని సయ్యద్ ఇంతియాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మహానేత బాబు జగ్జీవన్ రామ్

» వర్ధంతి సందర్భంగా ఘన నివాళు లర్పించిన హుస్నాబాద్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి--కొమురయ్య

కరపత్రం ప్రతినిధిబ్యూరో, జూలై 5

సామాజిక సమానత్వ సాధనకు జీవితాంతం పోరాడిన మహానేత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిని తన జీవిత లక్ష్యంగా మలుచుకున్న భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి - జులై 6 సందర్భంగా హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి--కొమురయ్య ఆయన ను ఘనంగా స్మరించుకొని, నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. అంటరానితనం, సామాజిక వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన గొప్ప ప్రజానాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశ నిర్మాణంలో తనదైన ముద్ర వేసిన మహోన్నత వ్యక్తిత్వమని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించడంలో ఆయన చేసిన కృషి భారత ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. సుమారు 50 సంవత్సరాల పాటు పార్లమెంటు సభ్యుడిగా, 35 సంవత్సరాలకు పైగా కేంద్ర మంత్రిగా వివిధ కీలక బాధ్యతలను సమర్థవంతంగా




నిర్వహించి ప్రజాసేవకు కొత్త నిర్వచనం ఇచ్చారని కొనియాడారు.

రైతులు, కార్మికులు, దళితులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం, అవకాశాల సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి, సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయడం ఆయనకు అందించే నిజమైన నివాళి అని చైర్ పర్సన్ దండి లక్ష్మి--కొమురయ్య పేర్కొన్నారు.

# అంబేద్కర్ నగర్‌లో అంబరాన్నంటిన బోనాల సంబరాలు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ నగర్ (మాదిగ) కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ, మాతమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు తలపై బోనాలు మోసుకుంటూ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించగా, డప్పు చప్పుళ్లు, భక్తుల జైజై ధ్వానాలతో ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ వేడుకలను 20వ వార్డు కౌన్సిలర్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కుమ్మరి శంకర్, 19వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి శిరీష శ్రీనివాస్, పెంట బాబు, పెంట శంకరయ్య, రాజేశం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తూమ్ మధు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# జాడి బాల్రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ ఫారాల పంపిణీ



**జాతీయ భూమి ప్రతినిది కరీం నగర్**
బిజెపి పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్రెడ్డి ఆధ్వర్యంలో రేకుర్తి 20 డివిజన్ ఇందిరమ్మ కాలనీలో ఎస్ ఐ ఆర్ సర్ లో భాగంగా బూత్ నంబర్లు 42, 44 లలో బి ఎల్ ఓ బిఎల్ఎ టు లు కలిసి ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లకు పంపిణీ చేశారు .జాడి బాల్రెడ్డి మాట్లాడుతూ బి ఎల్ వో లకు బిఎల్ఎ 2 లు సహకరించాలని, వారికి కాలనీలా నుండి వెళ్లిపోయిన ఇల్లు మారిన వారికి సమాచారం అందించి ఎన్యుమరేషన్ ఫారం అందే విధంగా వారు ఓటు నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని అన్నారు .ఓటర్లు నింపిన ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి ఎన్యుమరేషన్ ఫారం ఇచ్చిన బిఎల్ఓ కి అందించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో 42 , 44 బూతు ల బిఎల్ఎ టూ లు కొత్తపెల్లి శంకర్ ,జుట్టు మమత , కార్యకర్తలు సుకన్య ,ఎర్రోళ్ల ప్రశాంత్ ,చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మాల సంఘం బోనాల వేడుకల్లో బీజేపీ నేతల సందడి

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ మాల సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి నిర్వహించిన బోనాల వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సంటి మహేష్‌ను ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శులు ప్రతాప రామకృష్ణ, రేగుల మల్లికార్జున్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్, ప్రతాప రామకృష్ణకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంటి అంజిబాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గంగాదేవికి గంగపుత్రులు ఘనంగా బోనాలు

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 05:**



పాత రామగుండం లోని గంగపుత్రులు హౌసింగ్ బోర్డ్ గంగపుత్రులు ఐక్యంగా లోకమంతా సుభిక్షంగా ఉండాలని గోదావరి నది తీరం ఒడ్డున ఉన్న గంగ గౌరీ రామలింగేశ్వర ఆలయానికి పాత రామగుండం నుండి హౌసింగ్ బోర్డు ప్రాంతం నుండి కాలినడకన ఆడపడుచులంతా బోనాలను నెత్తిన పెట్టుకొని పోతరాజులతో నాట్యం ఆడుతూ డప్పు దరువులతో ఆలయానికి విచ్చేసిన అనంతరం రామలింగేశ్వరునికి అభిషేకాలు పూజా కార్యక్రమాలు నిర్వహించి గంగాదేవి అమ్మవారికి స్వామివార్లకు మహా నైవేద్యం సమర్పించిన అనంతరం కళ్యాణ కార్యక్రమం జరిపించి అన్న ప్రసాదం స్వీకరించిన అనంతరం అమ్మవారిని పూజా కార్యక్రమాలతో ఒప్పించి మెప్పించి మొక్కులు సమర్పించి లోకమంతా సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని రైతాంగం అభివృద్ధిలో సాగాలని వృత్తి పనులు చేసుకునే వారంతా సుభిక్షంగా ఉండాలని, రాబోయే రోజుల్లో కూడా ఇదే ఐక్యతతో బోనాల కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహించుకుంటామని, మా పిల్ల జల్లల్ని చల్లంగా కాపాడు తల్లి అని మొక్కులు సమర్పించారు.

# రైతు భరోసా సంబరాలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం -- రైతులకు స్వీట్లు పంపిణీ**





**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూలై 5:**
ఇల్లందకుంట మండల కేంద్రంలో రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టపాసులు కాల్చి, రైతులకు స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని కేవలం ఒక వృత్తిగా కాకుండా పండుగలా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, రైతు భరోసా పథకం అందుకు నిదర్శనమని అన్నారు. "అన్నదాత సుఖీభవ" అనేది కేవలం నినాదం మాత్రమే కాకుండా ప్రభుత్వ విధానమని, రైతులు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. రైతు భరోసా పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 67.44 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించబడిందని, 1.18 కోట్ల ఎకరాల సాగుభూమికి ఈ పథకం ద్వారా ప్రయోజనం కలిగిందని తెలిపారు. మొత్తం రూ.7,135.77 కోట్ల నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించామని చెప్పారు. చిన్న, సన్నకారు రైతుల నుంచి పెద్ద రైతుల వరకు ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఐదు రోజుల్లో పారదర్శకంగా నిధులు అందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులు అప్పుల భారం నుంచి బయటపడి, ప్రతి పంటకు అవసరమైన పెట్టుబడిని సమకూర్చుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని నాయకులు తెలిపారు. రైతు భరోసా నిధుల విడుదల కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా రైతన్నల ముఖాల్లో ఆనందాన్ని నింపే కార్యక్రమమని, తెలంగాణ వ్యవసాయ రంగంలో ఇది ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కనుమల్ల రామకృష్ణ, సీనియర్ నాయకులు గూడెపు సారంగపాణి, ఎక్కేటి సంజీవరెడ్డి, కనుమల్ల సంపత్, అన్నం ప్రవీణ్, వంగ రామకృష్ణ, గోలి కిరణ్, గుడిశాల పరమేశ్వర్, బొమ్మ శ్రీనివాస్, కారింగుల రాజేందర్, కోరు కండ్ల శ్రీనివాస్, ముష్కే కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు మీసా రాజయ్య, మర్రి వీరారెడ్డి, మూడెడ్ల మల్లేష్, బండి మల్లయ్య, గడ్డి శ్రీనివాస్, మూడెడ్ల రమేష్, మేడద తిరుపతిరెడ్డి, తోడేటి కిషన్, తెడ్ల బీరయ్య, మేకల సురేష్, మిట్ట మోహన్‌రావు, బైరెడ్డి కొండల్‌రెడ్డి, ఆరెల్లి రమేష్, ఆరె రమేష్‌రెడ్డి, మంకు ఐలయ్య, జక్కు కుమార్, రేణిగుంట్ల రవీందర్, రావుల రాజబాబు, గాండ్ల వెంకటేశ్, మారేపల్లి సుజన్‌బాబు, జిల్లెల్ల జలంధర్‌రెడ్డి, మేకల తిరుపతి, రామ్ కృపాకర్, గోరుకుంట్ల సాంబయ్య, ఆకినపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్






**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 5:**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి కౌన్సిలర్, ప్రతి పౌరుడు, ప్రతి మహిళ తమ నివాస ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. "తల్లి జన్మనిస్తే మొక్కలు పునర్జన్మ ఇస్తాయి" అనే భావనతో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. పట్టణాల్లో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, కాలుష్య సమస్యలను అధిగమించాలంటే విస్తృత స్థాయిలో మొక్కలు నాటడం అత్యవసరమని తెలిపారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పరిసరాలను అందించవచ్చని పేర్కొన్నారు. ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గృహాల ఆవరణల్లో మొక్కలు నాటాలని ఆయన కోరారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద వృక్షాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. వనమహోత్సవం లక్ష్యం కేవలం మొక్కల పెంపకమే కాకుండా పర్యావరణంపై సామాజిక బాధ్యతను పెంపొందించడమేనని వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలుగురి సురేష్, చందా రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, బొళ్ళ సదానందం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సీఎల్ఆర్పీలు, ఆర్పీలు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు.

# కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు భరోసా ఎక్కడ? -- సీపీఎం మండల కార్యదర్శి రాము ప్రశ్న



**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూలై 5**
ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులు, వ్యవసాయ కూలీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని సీపీఎం పార్టీ ఇల్లందకుంట మండల కార్యదర్శి చెల్పూరి రాము తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో రాము మాట్లాడుతూ, కౌలు రైతులు మరియు వ్యవసాయ కూలీలకు రూ.15 వేల రైతు భరోసా అందిస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను గాలికొదిలేసిందన్నారు. మాటల్లో రైతు సంక్షేమం గురించి మాట్లాడుతున్న ప్రభుత్వం, చేతల్లో మాత్రం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచిన కౌలు రైతులకు ఇప్పటికీ చట్టబద్ధమైన గుర్తింపు లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. పంట నష్టపోయినా పరిహారం అందకపోవడం, బ్యాంకు రుణాలు లభించకపోవడం, పంట బీమా వర్తించకపోవడం, రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకపోవడం వంటి సమస్యలతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ కూలీల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిందని రాము అన్నారు. పనిదినాలు తగ్గిపోవడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, కనీస వేతనాల అమలులో నిర్లక్ష్యం, ఉపాధి హామీ పథకం పనుల్లో జాప్యం కారణంగా గ్రామీణ పేదలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ప్రచార కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రైతులు, కూలీల సంక్షేమంపై స్పష్టమైన కార్యాచరణ లేకపోతే "ప్రజా ప్రభుత్వం" అనే నినాదం ప్రజలను మభ్యపెట్టే మాటగానే మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. కౌలు రైతులకు వెంటనే చట్టబద్ధమైన గుర్తింపు కల్పించి, రైతు భరోసా, పంట రుణాలు, పంట బీమా, పంట నష్టపరిహారం సహా అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు కచ్చితంగా అమలు చేసి, ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# చేనేత సహకార సంఘం అధ్యక్షునికి ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపురం శ్రీ మార్కండేయ పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చేనేత సహకార సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది నాగుల సత్యనారాయణను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగుల వెంకటేశం, రాపెల్లి సురేష్, ఉపాధ్యక్షుడు లింగం రాకేష్, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ, నాగుల సుదర్శన్, శీలం శ్రీను, రాపల్లి ప్రకాష్, నాగుల నరేందర్, నాగుల సత్యనారాయణ, గుండేటి అంజయ్య, దూస రవి, నాగుల సాయిరాం, అన్నదాస్ వెంకటేష్-కస్తూరి, అన్నదాస్ రాజు-లత, నాగుల వంశీతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

